క్లుప్తంగా

అమ్మవారికి అభిషేకాలు



అమ్మవారికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవి శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ఆదివారం పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ప్రతి ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ నేతృత్వంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

కొవ్వాడపేటలో వైద్యశిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు

బొండపల్లి: మండలంలోని కొవ్వాడపేట గ్రామంలో స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. నెలిమర్ల మిమ్స్ ఆస్పత్రి వైద్యులు పి.సుమిద, కె.సలోని, పి.గీతాంజలి, రాము,డి.రాజేష్ తదితరులు శిబిరంలో సేవలందించారు. గ్రామంతో పాటు చుట్టుపక్క గ్రామాల నుంచి శిబిరానికి వచ్చిన సుమారు వంద మంది ప్రజలకు వివిధ పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

చలివేంద్రం ఏర్పాటు



ప్రయాణికులకు మజ్జిగ అందజేస్తున్న పోలీసులు

గంట్యాడ: ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు ఏఎస్‌ఐ రాంబాబు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద మజ్జిగ, మంచినీరు చలివేంద్రాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, సాధ్యమైనంతవరకు ఎండలో ప్రయాణాలు మానుకోవాలన్నారు. హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎంపీపీ సోమేశ్వరరావు, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి

శృంగవరపుకోట: మండలంలోని సంతగవిరమ్మపేట గ్రామంలో శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో అయిదు దుకాణాలు దగ్ధమైన ఘటనలో బాధితులకు ఎంపీపీ సోమేశ్వరరావు, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి ఆదివారం నిత్యావసర సరుకులు అందజేశారు. ఒక్కో కుటుంబానికి 20కిలోల బియ్యం, ఇతర సరుకులు అందజేశారు. సర్పంచ్ గోగాడ కళావతి, ఎంపీటీసీ శ్రీదేవి, వైస్ సర్పంచ్ గోగాడ అప్పారావు, మండల జేసీఎస్ ఇన్‌చార్జి కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

గజపతినగరం రూరల్: మండలంలోని పాతబగ్గాం గ్రామంలో సోమవారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ సుదర్శన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పాల్గొంటారని, మండల అధికారులు, సంబంధిత సచివాలయ సిబ్బంది హాజరు కావాలని కోరారు.

విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక రేపు

బొండపల్లి: గజపతినగరంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో ఈనెల 18న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈఈ ఆర్.శంకరరావు ఆదివారం తెలిపారు. ఈ వేదికకు సీజీఆర్ఎఫ్ చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ హాజరవుతారని పేర్కొన్నారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వినతులు స్వీకరించి, పరిష్కారానికి కృషి చేయనున్నట్లు స్పష్టం చేశారు. విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అభివృద్ధికి రాజమార్గం

- సోంపురం- ఆనందపురం రహదారికి మోక్షం
- రూ.39.14 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు



సోంపురం- ఆనందపురం రహదారిలో ఎస్.కె.ఆర్.పురం వద్ద పూర్తయిన విస్తరణ పనులు



చిరతపాలెం జంక్షన్ వద్ద చేపడుతున్న పనులు



ఎస్.కె.ఆర్.పురం- భర్తవానిపాలెం మధ్య నిర్మించిన కల్వర్టు

శృంగవరపుకోట: ఒక్క రహదారి.. మండలం తీరుతెన్నులు మార్చబోతోంది. సుమారు 50 వేల పైచిలుకు జనాభా ఆశలు, ఆకాంక్షలు, అభివృద్ధిని నిజం చేయనుంది. అదే.. జిల్లాలోని సోంపురం-ఆనందపురం రహదారి. జిల్లాలో వెనుకబడిన వేపాడ మండలం మొత్తాన్ని అనుసంధానం చేసేది ఈ ఒక్క రహదారే. రెండు దశాబ్దాల క్రితం సోంపురం-ఆనందపురం మెటల్ రోడ్డును తారురోడ్డుగా మార్చారు. అటు తర్వాత చిన్న చితకా మరమ్మతులు తప్ప రహదారి అభివృద్ధికి నోచుకోలేదు. ఎట్టకేలకు వైఎస్సార్‌సీపీ సర్కారు చొరవతో ఈ రహదారికి మోక్షం లభించింది.వేపాడ మండలంలోని సోంపురం జంక్షన్ నుంచి అనకాపల్లి జిల్లాలోని ఆనందపురం వరకు ఉన్న 16.8 కిలో మీటర్ల రహదారి విస్తరణ, అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.39.14 కోట్ల ఎన్‌డీబీ నిధులు విడుదల చేసింది. ఇది వరకు 3.50 మీటర్ల వెడల్పు ఉన్న రోడ్డును 7 మీటర్ల వెడల్పు చేస్తున్నారు. రోడ్డులో ప్రస్తుతం ఒక మైనర్ బ్రిడ్జి, శ్లాబ్ కల్వర్ట్, 4 బాక్స్ కల్వర్టులు, 48 పైపు కల్వర్టులను నిర్మిస్తున్నారు. 2.8 కిలో మీటర్ల మేర సీసీ రోడ్డు, 2.98 కిలో మీటర్ల మేర సీసీ డ్రైన్లు, 13.996 కిలో మీటర్ల మేర బ్లాక్‌టాప్(తారు) రోడ్డు వేస్తున్నారు.

మండలాభివృద్ధికి మార్గం సుగమం

సోంపురం-ఆనందపురం రహదారి పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందితే ఎలమంచిలి, అనకాపల్లి, చోడవరం ప్రాంతాల నుంచి ప్రయాణికులతో వచ్చే వాహనాలు, సరుకు రవాణా వాహనాలు పెరుగుతాయి. దీంతో వర్తక, వాణిజ్య వ్యాపారాలు, రియల్ ఎస్టేట్ రంగాలు ఊపందుకుని అన్ని రకాలుగా వేపాడ మండలం అభివృద్ధి చెందుతుంది. మండలంలో 22 పంచాయతీలను కలుపుతూ వాటి అభివృద్ధికి ఆధారం ఈ రహదారి. వేపాడ మండలానికి పల్లె వెలుగు బస్ ఒక్కటి కూడా లేదు. మండలవాసులు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే నిత్యం అవస్థలు పడాల్సిందే. ఆటోలు తప్ప మరో గత్యంతరం లేదు. రోడ్డు బాగాలేదని, ఉన్న బస్సులు తీసేశారు. రోడ్డు విస్తరణ పూర్తయితే అనకాపల్లి, చోడవరం, దేవరాపల్లి నుంచి వేపాడ మీదుగా ఎస్.కోటకు సరీ్వసులు వస్తాయన్న ఆశాభావంతో మండల వాసులు ఉన్నారు. రోడ్డు-రవాణా సౌకర్యాలు మెరుగుపడితే తమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్న మండల వాసులు ఎదురు చూపులు ఇన్నాళ్లకు ఫలించబోతున్నాయి.

కష్టాలు తీరుతాయి



ఈ రోడ్డు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందితే మా మండల వాసుల కష్టాలు తీరుతాయి. బస్సులు లేక, రోడ్డు బాగా లేక, ప్రైవేటు వాహనాలు రాక ఇబ్బందులు పడుతున్నాం. జగనన్న సర్కారు దయతో ఇప్పుడు రోడ్డును అభివృద్ధి చేస్తున్నారు. ఎస్.కోట నుంచి అనకాపల్లి, చోడవరం బస్సులు వేస్తే మా ఇబ్బందులు పూర్తిగా తీరుతాయి.

– కర్రి యశోధ, సర్పంచ్, బానాది గ్రామం

అభివృద్ధికి ఆస్కారం



ఏ ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా రహదారులు ముఖ్యం. సోంపురం- ఆనందపురం రోడ్డు విస్తరణతో ఈ ప్రాంతం ఖచ్చితంగా అభివృద్ధి చెందుతుంది. వ్యాపార, వ్యవహారాలు సాగుతాయి. బయటి ప్రాంతాల వారు వస్తారు. భూముల ధరల పెరుగుతాయి. రవాణా సౌకర్యాలు మెరుగవుతాయి.

– బొద్దు మంగరాజు, జగ్గయ్యపేట గ్రామం

రక్తదానం సామాజిక బాధ్యత



రక్తదాతలను అభినందిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి(గరివిడి): ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని, రక్తదానం సామాజిక బాధ్యతగా భావించాలని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. గతేడాది మృతి చెందిన ఉపాధ్యాయిని ఉప్పు పార్వతి, సహాయ్ స్వచ్ఛంద సంస్థ సభ్యుడు కుమిలి శ్రీహరి, ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన నేవీ మెరైన్ కమాండో చందక గోవింద్ జ్ఞాపకార్థం గరివిడి పట్టణానికి చెందిన సహాయ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గరివిడిలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈశిబిరాన్ని ఎంపీ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చని అన్నారు. అత్యవసర సమయాల్లో రక్తం లభించక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని, మనం చేసే రక్తదానం వేరొకరికి ప్రాణదానమని అన్నారు. సహాయ్ స్వచ్ఛంద సంస్థ ఎప్పటికప్పుడు రక్తదాన శిబిరాలు నిర్వహిస్తుండడం అభినందనీయమని అన్నారు. శిబిరంలో 40 మంది నుంచి విశాఖపట్నానికి చెందిన ఏ.ఎస్.రాజా బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రక్తం సేకరించారు. ఎస్ఎంఎస్ ఫెర్రో పరిశ్రమ డైరెక్టర్ వాకాడ గోపి, జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, గంట్యాడ బుజ్జి, సహాయ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు వుప్పు శ్రీను, కోశాధికారి సీతారాం, సంస్థ ప్రతినిధులు సరిది రాంబాబు, బమ్మిడి కార్తీక్, ఎస్.శ్రీనివాసరావు, చిన్న, శంకర్, సివుకు కాంతారావు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



పథకాల లబ్ధిని మహిళలకు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



పింఛన్ వస్తుందా అని వృద్ధుడిని ఆరా తీస్తున్న ఎమ్మెల్యే

కొత్తవలస: రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమం, ప్రతీ కుటుంబం సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. మండల కేంద్రంలో సచివాలయం-1 పరిధిలో ఆదివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు.ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమ పథకాల ద్వారా ప్రతీ కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ ప్రజలను ఆరా తీశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సందేశ పత్రాన్ని వారికి అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్ ఆదేశాలతో ప్రజలకు పథకాలు అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకునేందుకు గడప గడపకూ వస్తున్నామని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వంలో తమ దృష్టికి వచ్చిన సమస్యల్లో చాలా వరకు అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామని, మరి కొన్నింటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరిస్తున్నామని చెప్పారు. అత్యవసరంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనుల కోసం ప్రతీ సచివాలయానికి సీఎం జగన్ రూ.20 లక్షలు చొప్పున మంజూరు చేస్తున్నారని వివరించారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, ప్రభుత్వ సేవలన్నీ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు చేరువ చేశామని, పాఠశా లలు, ఆస్పత్రులను నాడు-నేడు పథకంలో భాగంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తున్నా మని, ప్రజలకు మంచి జరిగితే చూసి ఓర్వలేక ప్రభుత్వంపై టీడీపీతో పాటు కొన్ని పార్టీలు, ఎల్లో మీడియా నిత్యం దుష్ప్రచారం చేస్తున్నాయని దుయ్యబట్టారు. టీడీపీ వారి మాయమాటలను నమ్మవద్దని, అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న జగనన్నను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి జయప్రకాష్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ రామస్వామి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి బొంతల వెంకటరావు, పార్టీ నాయకులు గొరపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయమే మేలు



ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న డీపీఎం ఆనందరావు

బొండపల్లి: పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయమే అన్ని విధాలా మేలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రబంధకుడు (డీపీఎం) ఎస్.ఆనందరావు అన్నారు. మండలంలోని కొవ్వాడపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పంటలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 365 రోజులూ ఏదో ఒక పంటను సాగు చేయడం వల్ల భూమి సారవంతంగా ఉంటుందని తెలిపారు. జిల్లాలో కొన్ని గ్రామాలను ప్రకృతి వ్యవసాయానికి ఎంపిక చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ మెర్సీ,మండల యాంకర్ ఎస్.రామకృష్ణ, ఐసీఆర్‌పీ ఎం.కిషోర్, ఎం.రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో నేల తల్లి బాగు



నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏఓ మల్లికార్జునరావు

బొండపల్లి: నవ ధాన్యాలను సాగు చేయడం వల్ల జీవవైద్యం పెరిగా భూమికి ఎంతో మేలు జరుగుతుందని, భూసారం పెరుగుతుందని ఏఓ పి.వి.మల్లికార్జునరావు అన్నారు. నవధాన్యాల సాగుతో కలిగే ప్రయోజనాలపై మండల కేంద్రంలో రైతులకు ఆదివారం అవగాహన కల్పించడంతో పాటు ఖరీఫ్ ప్రణాళికలపై చర్చించారు. ఖరీఫ్ పంటలను సాగు చేసే పొలాల్లో నవధాన్యాలను చల్లాలని, 45 రోజుల తర్వాత చేనును భూమిలో కలియ దున్నడం ద్వారా భూమికి అనేకపోషకాలు అందుతాయన్నారు. గజపతినగరం సబ్ డివిజన్ ఎస్ఎఫ్ బి.సత్యనారాయణ, ప్రకృతి వ్యవసాయం మండల యాంకర్ ఆర్.బంగారం, ఎస్.రామకృష్ణ ,ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

అవగాహనతో అగ్నిప్రమాదాల నివారణ



గజపతినగరం: గ్యాస్ లీకేజీ మంటలను అదుపు చేయడంపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



శృంగవరపుకోట: అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

గజపతినగరం: అవగాహన,అప్రమత్తతతో అగ్ని ప్రమాదాలను నియంత్రించవచ్చని అగ్నిమాపకశాఖ అధికారి ఎం.ఎస్.వి.రవిప్రసాద్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఎం.వెంకటాపురంలో ప్రజలకు ఆదివారం అవగాహన కల్పించారు. వంట గ్యాస్‌లీక్ అయ్యి మంటలు వ్యాపించినప్పుడు అదుపు చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. అగ్నిమాపక అధికారి మాట్లాడుతూ ఇళ్లలో వంటలు చేసేటప్పుడు గాలి, వెలుతురు ఉండేటట్లు చూసుకోవాలని అన్నారు. గ్యాస్ సి లిండర్ నుంచి మంటలు వచ్చినప్పుడు భయాందోళన చెందకుండా దుప్పటి లేదా గోనె సంచులను నీ టిలో తడిపి సిలిండర్‌కు చుడితే మంట అదుపులోకి వస్తుందని చెప్పారు. అగ్నిమాక సిబ్బంది పాల్గొన్నా రు.

ఎస్.కోటలో..

శృంగవరపుకోట: అగ్నిమాపకశాఖ వారోత్సవాల్లో భాగంగా స్థానిక రైల్వేకాలనీలో ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణ, నియంత్రణపై ఆదివారం అవగాహన కల్పించారు. గ్యాస్ లీకేజీ ప్రమాదాల సమయంలో మంటలు ఎలా అదుపు చేయాలి, ప్రమాదంలో చిక్కుకున్న వారిని ఎలా కాపాడాలి తదితర విషయాలను ఫైర్ ఆఫీసర్ షేక్ మదీనా నేతృత్వంలో వివరించారు. అంతకుముందు అగ్నిమాపకశాఖ కార్యాలయం వద్ద అగ్నిమాపక సిబ్బంది చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రయాణికులు, పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు.

ఆర్య వైశ్య మహాసభ రేపు

వేపాడ: బొద్దాం గ్రామంలో వేపాడ, ఎల్.కోట మండలాల స్థాయి ప్రపంచ ఆర్య వైశ్యమహాసభను మంగళవారం నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం ఇన్‌చార్జి పచ్చిపులుసు ఈశ్వరరావు, కార్యదర్శి హనుమానిశెట్టి నానాజీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వేపాడ, ఎల్.కోట మండలాల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దుడ్డు బంగారుశెట్టి, శ్రీనాథ భాస్కరరావు సారథ్యంలో నిర్వహించే ఈసభలో రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జూలకంటి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు ముప్పిడి వెంకట సత్యనారాయణ,రాష్ట్ర డైరెక్టర్ తువ్వా మోహన్ రావు, జిల్లా అధ్యక్షుడు పూసర్ల మోహన్ జిలా కార్యవర్గం, శ్రీకాకుళం జిల్లా నాయకులు,అధికార ప్రతినిధి ఉప్పల ఈశ్వరరావు పాల్గొంటారని పేర్కొన్నారు. ఆర్యవైశ్యులు అంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సంక్షిప్తంగా...

నేడు ఉపకరణాలకు ఎంపిక

గజపతినగరం: విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు అందించేందుకు నియోజకవర్గ కేంద్రం గజపతినగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నియోజకవర్గస్థాయి ఎంపిక శిబిరం సోమవారం నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ సుదర్శనం ఆదివారం తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగించుకోవాలని సూచించారు.

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

గుర్ల: ప్రతీవిద్యార్థి పాఠశాల స్థాయిలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు కృషి చేయాలని ఎస్ఐ హరిబాబునాయుడు సూచించారు. కలవచర్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు అంశాలపై ఆదివారం అవగాహన కల్పించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని,మంచిమార్గంలో నడుచుకోవాలన్నారు. మొబైల్స్‌తో కాలక్షేపం చేయకుండా శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. స్కూల్ చైర్మన్ కూర్మారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త కందుకూరి

జామి: కందుకూరి వీరేశలింగం గొప్ప సంఘసంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి, సాహితీవేత్త అని మహిళా స్ఫూర్తి జిల్లా అధ్యక్షురాలు ఆళ్ల శిరీష అన్నారు. అట్టాడ బి.ఎస్.ఆర్ ఆశ్రమంలో కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శిరీష మాట్లాడుతూ మూఢ నమ్మకాలు,బాల్యవివాహాల నిర్మూలన, వితంతు వివాహాలు, మహిళాభివృద్ధికి కందుకూరి చేసిన కృషి మరువలేనిదన్నారు. డాక్టర్ బాలభార్గవి, ఆశ్రమ నిర్వాహకులు భీశెట్టి బాల వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

అనాథలకు భోజనాల పంపిణీ

బొండపల్లి: ఒంపల్లిలోని శాంతినివాస్ ఆశ్రమంలో వందమంది అనాథ పిల్లలకు గజపతినగరం మండలం పురిటిపెంట గ్రామానికి చెందిన పిల్లా గోపి నాథ్ జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు ఆదివారం భోజనాలు పంపిణీ చేశారు. ఆశ్రమం డైరెక్టర్ జార్జ్ విక్టర్, పర్యవేక్షకులు సునీల్, పిల్లా తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్‌లో స్పందన

మెరకముడిదాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక 'స్పందన' కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పి. రామకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు హాజరవుతారని, ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందించవచ్చని పేర్కొన్నారు.

రైతులకు సన్మానం



రైతులను సన్మానిస్తున్న డాక్టర్ చిట్టిరామారావు, పరశురాం , తదితరులు

జామి: మండలంలో బలరాంపురం గ్రామంలో భార్గవ్ హెల్ప్‌లైన్ అధ్యక్షుడు కంది భార్గవ్ ఆధ్వర్యంలో రైతులను ఆదివారం సన్మానించడంతో పాటు మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఉత్తమ రైతులుగా ఎంపికైన గుల్లిపల్లి ఎర్నాయుడు, గట్రెడ్డి శ్రీనివాసరావు,కంది రామును వైద్యులు చిట్టి రామారావు, జిల్లా పోలీస్ న్యాయ సలహాదారుడు యేరుతు పరశురాం సన్మానించారు.భార్గవ్‌హెల్ప్‌లైన్ వ్యవస్థాపకులు కె.వి.రమణ, రైల్వే కబడ్డీ కోచ్ జూరెడ్డి శ్రీనివాసరావు, హెల్ప్‌లైన్ సభ్యులు పెంటయ్య, కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

గజపతినగరం: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని ఎస్ఐ గంగరాజు హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై ఆదివారం అవగాహన కల్పించారు. మద్యం తాగి ఆటోలు నడిపితే చర్యలు తప్పవన్నారు.

స్తంభించిన ట్రాఫిక్

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం రైల్వే గేటు వద్ద ఆర్‌ఓబీ నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు గోతులమయం కావడంతో ఆ రోడ్డులో ఆదివారం ఓ లారీ కూరుకుపోయింది. రోడ్డు మధ్యలో లారీ నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు అడ్డంకిగా మారింది. కిలో మీటర్ వరకు జాతీయ రహదారిపై వాహనాలు నిలిచి పోయాయి. విషయం తెలుసుకున్న పెదమానాపురం ఎస్ఐ జి.శిరీష సిబ్బందితో చేరుకుని ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.

మంచి చేస్తున్న జగనన్నను ఆశీర్వదించండి

అన్నివర్గాల ప్రజలకు మంచి చేస్తున్న, పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించాలని పలువురు ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రజలను కోరారు. గజపతినగరం, చీపురుపల్లి, శృంగవరపుకోట నియోజకవర్గాల్లో 'జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వేజగన్' కార్యక్రమం పదో రోజు ఆదివారం ఉత్సాహంగా కొనసాగింది. గ్రామాల్లో ఇంటింటికీ గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, నాయకులు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజాభిప్రాయం సేకరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అందుతున్నన్ని పథకాలు గత టీడీపీ పాలనలో అందేవా అని ప్రజలను ఆరా తీశారు. వైఎస్సార్‌సీపీ పాలనకు, గత టీడీపీ పాలనకు తేడాలను వివరించారు. అనంతరం ప్రజల అనుమతితో వారి ఇళ్లకు 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను అతికించారు.

– సాక్షి నెట్‌వర్క్



గజపతినగరం : పురిటిపెంటలో నిర్వహించిన కార్యక్రమంలో వైస్ సర్పంచ్ సురేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు ఆదినారాయణ



గంట్యాడ: రామవరంలో 'మా నమ్మకం నువ్వేజగన్' స్టిక్కర్‌ను ఇంటికి అతికిస్తున్న ఎంపీపీ హైమావతి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు జైహింద్‌కుమార్



బొండపల్లి: గొట్లాంలో పథకాలను వివరిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ రమణ, నాయకులు తులసీరాం, తదితరులు



దత్తిరాజేరు: వంగరలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న సర్పంచ్ నాయుడుబాబు, సచివాలయ కన్వీనర్ చిరంజీవి



వేపాడ: పి.కె.ఆర్.పురంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గుబాబు తదితరులు



గజపతినగరం: పురిటి పెంట న్యూకాలనీలో ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న ఎంపీటీసీ రేగలత తదితరులు



జామి: భీమసింగిలో ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న నాయకులు



మెరకముడిదాం: బిళ్లలవలసలో పథకాలను వివరిస్తున్న నాయకుడు వర్మ, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు



గుర్ల: రాగోలులో పథకాల లబ్ధిని వివరిస్తున్న సర్పంచ్ బంగారునాయుడు